# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 96 మంగళవారం | 10 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5





# నిరాశలో నిరుద్యోగులు



- ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి
- ఇప్పటికే రెండు సార్లు గ్రూప్-1 పరీక్ష రద్దు
- గ్రూప్-2 వాయిదా అంటూ లీకులు
- 14న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు
- మద్దతుగా నిలుస్తున్న అఖిల పక్ష రాజకీయ పార్టీలు,విద్యార్థులు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక

ఉద్యోగాల భర్తీలో దేశానికే తెలంగాణ రోల్ మాడల్.. నీళ్లు, నిధులు, నియామకాలే నినాదంగా ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొలువుల జాతర సాగుతోంది.. దేశ చరిత్రలోనే అనతి కాలంలో ఇన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అనుమతులు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అంటూ ఊదర గొట్టిన పాలకులు సంవత్సరంన్నర కావొస్తున్నా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా నిలువునా ముంచడంపై నిరుద్యోగులు భగ్గుమంటున్నారు. ప్రభుత్వ కొలువులకోసం తిండికి, బట్టకు, కుటుంబాలకు దూరమై కోచింగ్ సెంటర్లలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న లక్షలాదిమంది నిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండిపడుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు గ్రూప్-1 పరీక్ష రద్దు కావడంతోపాటు గ్రూప్-2 వాయిదా అంటూ లీకులు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, టీఎస్పీఎస్సీ వైఫల్యాలను ఎండగడుతూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమాన్ని తలపించేలా రాస్తారోకోలు, నిరసనలు చేసేందుకు సిద్ధపడుతున్నారు.

- వరంగల్ వాయిస్, వరంగల్




## సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

### జ్యోతి ప్రజ్వలన చేయనున్న సినీ తార రాశీఖన్నా



హనుమకొండలోని నయింనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల్లోనే అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ అయిన సిఎంఆర్ షాపింగ్ మాల్ ను బుధవారం ఉదయం 11.06గంటలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రముఖ సినీతార రాశీఖన్నా జ్యోతి ప్రజ్వలన చేయనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, అరూరి రమేష్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, కార్పొరేటర్ చెన్నం మధుసూదన్, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు పాల్గొననున్నారు. రైస్ మిల్లర్స్ యజమాని, బియ్యం ఎగుమతి వ్యాపారి ఎన్.రామ్మూర్తి మొదటి కొనుగోలు చేయనున్నారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ






## పోలీస్ కమిషనరేట్‌లో అవినీతి చెదలు



- కొనసాగుతున్న సస్పెన్షన్ల పర్వం
- తాజాగా మరో ముగ్గురు

2లో




8లో..

## ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

# నిరాశలో నిరుద్యోగులు




**ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి**
**ఇప్పటికే రెండు సార్లు గ్రూప్-1 పరీక్ష రద్దు**
**గ్రూప్-2 వాయిదా అంటూ లీకులు**
**14న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, ధర్నాలు**

నీళ్లు, నిధులు, నియామకాలే నినాదంగా ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిది సంవత్సరాల తర్వాత కొలువుల జాతర అంటూ పాలకులు ఊదరగొట్టి ఉసూరుమనిపించడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఓ స్త్రీ రేపు రా..అన్న చందంగా రోపొచ్చే..మాపొచ్చే అంటూ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచిందంటూ నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఆస్తులు అమ్ముకొని, చేస్తున్న కొలువులకు రాజీనామా చేసి కుటుంబాలకు దూరమై ప్రభుత్వ పరీక్షలకు సిద్ధపడితే పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా అవి రద్దు కావడంపై మండి పడుతున్నారు. సుదీర్ఘ కాలం తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడంతోపాటు ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా 10 సంవత్సరాలుగా ప్రభుత్వ కొలువుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతకాని ప్రభుత్వంపై మర్లపడేందుకు నిరుద్యోగులంతా ఒక్కటవుతున్నారు. తమ సత్తా చూపించేందుకు సిద్ధపడుతున్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు సై అంటున్నారు. నిరుద్యోగులపై చిన్నచూపు తగదంటూ హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలను రెండు పర్యాయాలు నిర్వహించి రద్దుచేయడంతోపాటు గ్రూప్-2 పరీక్ష వాయిదా అంటూ లీకులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### 91,142 పోస్టులు..

అసెంబ్లీ సాక్షిగా 8 మార్చి, 2022 న నిరుద్యోగులకు సీఎం కేసీఆర్ గుడ్‌న్యూస్ చెప్పారు. నిరుద్యోగ యువత ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 91,142 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేపడుతుందంటూ కీలక ప్రకటన చేశారు. ఇందులో 80,039 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని, మిగిలిన 11 వేల కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామంటూ ప్రకటించారు. విద్యాశాఖలో 13, 086 పోస్టులు, హోం శాఖలో 18,334 పోస్టులు, వైద్యారోగ్యశాఖలో 12, 755 ఉద్యోగాలు, ఉన్నత విద్యాశాఖలో ఏడు వేలకుపైగా ఉద్యోగాలు ఉన్నాయని సీఎం కేసీఆర్ తెలిపారు. దీంతో ప్రభుత్వ ఖజానాపై రూ.7,300 ఆర్థిక భారం పడుతుందని వివరించారు. ఈ రోజు నుంచే నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దిగువ స్థాయి క్యాడర్ నుండి ఉన్నత స్థాయి క్యాడర్ దాకా స్థానిక అభ్యర్థులకు 95 శాతం రిజర్వేషన్ అమలవుతుందన్నారు. దేశంలోనే స్థానికులకు ఇంత పెద్ద మొత్తంలో రిజర్వేషన్ కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అంటూ ప్రకటించారు. పోటీ పరీక్షలకు ఎక్కువ మంది అర్హులయ్యేలా గరిష్ఠ వయోపరిమితిని 10 సంవత్సరాలు సడలిస్తున్నట్లు వెల్లడించారు.



### ఎదురు చూపులే..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే మన కొలువులు మనకే దక్కుతాయన్న ఆశతో నిరుద్యోగులు తెగించి పోరాడారు. సకల జనుల సమ్మె చేశారు. జైలు జీవితం, కోర్టు కేసులకు భయపడలేదు. ఆత్మ బలిదానాలకు సైతం వెనుకాడలేదు. ఎంతోమంది ఆత్మ బలిదానాలతో సిద్ధించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్య తీరుతుందని అందరూ ఆవపడ్డారు. కాని రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు కావస్తున్నా నిరుద్యోగుల ఆశలు మాత్రం నెరవేరలేదు. ఇప్పటికీ ప్రభుత్వ కొలువులకోసం కన్నవారికి, కట్టుకున్న భార్యకు, కడుపున పుట్టిన పిల్లలకు దూరంగా ఉంటూ ప్రిపేర్ అవుతున్నారు. తొమ్మిది సంవత్సరాల తర్వాత కొలువుల జాతర అంటూ ప్రభుత్వం ప్రకటించి నోటిఫికేషన్లు విడుదల చేసినా పాలకుల నిర్లక్ష్యం, టీఎస్పీఎస్సీ వైఫల్యంతో ఎదురు చూపులు తప్పడం లేదు.

### టీఎస్పీఎస్సీని రద్దు చేయాలి..

నిరుద్యోగులతో చెలగాటమాడుతూ ఇప్పటికే రెండు సార్లు గ్రూప్-1 పరీక్ష రద్దు చేయడంతోపాటు గ్రూప్-2 వాయిదా అంటూ లీకులిస్తున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ప్రస్తుత బోర్డు చైర్మన్ తో సహా సభ్యులందరినీ తొలగించి టీఎస్పీఎస్సీ చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారం కొత్త సభ్యులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని, గ్రూప్-1 పరీక్షల రద్దుకు టీఎస్పీఎస్సీ బాధ్యత వహించి పరీక్షకు హాజరైన ప్రతి నిరుద్యోగికి రూ.3లక్షల పరిహారం చెల్లించాలని, ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13,500 కు డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

### 14 న రాస్తారోకో..

టీఎస్పీఎస్సీ వైఫల్యం, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఈ నెల 14 న రాష్ట్రంలో నాలుగు రహదారులపై పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించాలని నిరుద్యోగులతోపాటు, అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదికలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా ప్రభుత్వంపై విద్యార్థుల, నిరుద్యోగుల అసంతృప్తిని వ్యక్తం చేయడంతోపాటు, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలని నిర్ణయించాయి. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకూ మహబూబ్ నగర్ నుంచి హైదరాబాద్ రహదారిలో మహబూబ్ నగర్, జడ్చర్ల, షాద్ నగర్, శంషాబాద్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించాలని నిర్ణయించారు. అదే విధంగా వరంగల్ నుంచి హైదరాబాద్ రహదారిపై వరంగల్, స్టేషన్ ఘనపూర్, జనగాం, ఆలేరు, భువనగిరి, ఘటకేశ్వర్ లలో, రామగుండం నుంచి హైదరాబాద్ రహదారిపై రామగుండంపెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, గజ్వేల్, శమీర్ పేట, తూంకుంట, ఖమ్మం నుంచి హైదరాబాద్ రహదారిలో ఖమ్మం, కూసుమంచి, సూర్యాపేట, నకిరేకల్, నార్కట్ పల్లి, చిట్యాల, చౌటుప్పల్, హయత్ నగర్ ప్రాంతాల్లో రాస్తారోకోలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, తెలంగాణ జన సమితి, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, న్యూ డెమోక్రసీ-ప్రజా పంథా పార్టీలు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీతోపాటు పీడీఎస్ యూ, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘాలు పాల్గొనున్నాయి. ఈ రాస్తారోకోలో ప్రజలందరూ ముఖ్యంగా యువత, నిరుద్యోగులు, విద్యార్థులకు పాల్గొని మద్దతుగా నిలువాలని కోరారు.

# పోలీస్ కమిషనరేట్‌లో అవినీతి చెదలు

**కొనసాగుతున్న సస్పెన్షన్ల పర్వం**
**తాజాగా మరో ముగ్గురు**




**వరంగల్ వాయిస్, క్రైం :** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న స్మగ్లర్ల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడిన కేయూసి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కె.వాసుతోపాటు మరో ఇద్దరు హోంగార్డులు బి.అనిల్, జి.అనిల్ ను సస్పెండ్ చేస్తూ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్ళితే కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా నాలుగు కిలోల గంజాయిని కారులో రెండు వేరు, వేరు ప్రదేశాల్లో రహస్యంగా తరలిస్తుండగా కేయూసి పోలీస్ స్టేషన్ పరిధిలో బీట్ డ్యూటీ నిర్వహిస్తున్న వాసు, బి.అనిల్, జి.అనిల్ పట్టుకున్నారు. దీంతో స్మగ్లర్లను బెదిరించి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడంతో పాటు వారి నుంచి కొద్ది మొత్తంలోనే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తప్పుడు రిపోర్టులు రాసి వదలివేశారు. ఇదే స్మగ్లర్లు తమ వద్దనున్న గంజాయిని నర్సంపేటలో విక్రయిస్తుండగా నర్సంపేట పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అవినీతి పోలీసుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన సీపీ అవినీతికి పాల్పడిన ఇక కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డులను సస్పెండ్ చేశారు.

### ముందస్తు అనుమతి తప్పనిసరి..

ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ఇకపై వివిధ ఫిర్యాదుదారులకు ముందస్తు అనుమతి తప్పనిసరని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఫిర్యాదు దారుడు తొలుత స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్, ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మీరు చేసిన ఫిర్యాదుపై అధికారుల నుంచి సరైన స్పందన లేకున్నా, న్యాయం జరగలేదని భావించినపుడు, పోలీస్ అధికారుల పనితీరుపై ఫిర్యాదులు అందజేయాలనుకున్న వారు 8712685100 వాట్సాప్ నంబర్ కు సంక్షిప్త మెసేజ్ లేదా వాయిస్ మెసేజ్ పెట్టాలన్నారు. ఇలా వచ్చిన మెసేజ్ లను పరిశీలించిన అనంతరం ఫిర్యాదు దారులు పోలీస్ కమిషనర్ ను ప్రత్యక్షంగా కలిసేందుకు సమయాన్ని కేటాయిస్తామన్నారు. వారికి కేటాయించిన సమయంలో మాత్రమే ఫిర్యాదుదారులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయమునకు రావాల్సి ఉంటుందని ప్రకటనలో వెల్లడించారు.

# పల్లా, ముత్తిరెడ్డి మధ్య కుదిరిన సయోధ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ ఎస్ జనగామ నియోజకవర్గ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రావు పేరు ఖరారైంది. మంగళవారం హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మధ్య సయోధ్య కుదిర్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్ జనగామ ఆశావహులతో సమావేశమయ్యారు. పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపించాలని జనగామ నేతలకు కేటీఆర్ సూచించారు. ఈ సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో పాటు స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కాగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపునకు కలిసి పని చేయాలని తన కార్యకర్తలకు ముత్తిరెడ్డి పిలుపునిచ్చారు.



# ఎమ్మెల్యే చల్లాకు ఓటమి తథ్యం

## మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



**వరంగల్ వాయిస్, పరకాల :** మోసపూరిత వాగ్దానాలను చేసిన ఎమ్మెల్యేకు ఓటమి తథ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల అభివృద్ధి పై అంబేద్కర్ బొమ్మ కాడికి బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే చల్లాకు మొలుగూరి భిక్షపతి సవాల్ విసిరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించగా మొలుగూరి బిక్షపతి మాట్లాడుతూ నియోజకవర్గ పట్టణ కేంద్రంలో ఏ గల్లీలో అభివృద్ధి చేసినావో, ఆ అభివృద్ధిపై చర్చించడానికి అంబేద్కర్ సెంటర్ రావడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు. బీసీ బంధు, దళిత బంధులతో నియోజకవర్గంలోని ఏ ప్రాంతానికి వెళ్లిన మోసం చేయడమేనని చల్లా ధర్మా రెడ్డి కాదు దగా ధర్మా రెడ్డి అని మండిపడ్డారు. ఎమ్మెల్యే కాకముందు నీ ఆస్తులు ఎంతో.. ఎమ్మెల్యే అయ్యాక పది సంవత్సరాల నుంచి ఆస్తి ఎంతో లెక్కకు సిద్ధమా అని ప్రశ్నించారు. పేదవాళ్ల ఉసురు తగిలి నీకు ఓటమి ఖాయమని హెచ్చరించారు. ఏ ఊరికి వెళ్ళినా ఎమ్మెల్యేకు ప్రజలు నిరసనలతో తరిమికొట్టేందుకే సిద్ధమయ్యారని మండిపడ్డారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమని అప్పుడు చల్లా అవినీతి మొత్తం బయటకు తీస్తామని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ బీఆర్ఎస్ నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని వెంటనే ఆయన్ని సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్త భిక్షపతి, ఆర్పీ జయంతి లాల్, మేఘనాథ్, దుబాసి వెంకటస్వామి, వీరస్వామి, తిరుపతి, నిరంజన్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## రావు పద్మ సమక్షంలో బీజేపీలో చేరికలు



**వరంగల్ వాయస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల రజనీకాంత్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరందరికీ రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దండ విజయ -విజేందర్ రెడ్డి, జన్నత శ్రీనివాస్, జినుకల లక్ష్మణ్ రావు, చెలుమల్ల సమ్మయ్య, పచ్చిక సురేందర్ రెడ్డి, గాండ్ల సంతోష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు కొత్త దశరథం, మహేందర్, కొల సురేందర్, గురిజాల మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** పట్టణ కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయానికి పట్టణానికి చెందిన ఓలేటి యాదగిరి ఆచార్యులు రూ. 10 వేల విలువ గల పుస్తకాలను మాజీ ఎంపీటీసీ, సామాజిక సంఘ కార్యకర్త ధారావత్ సోమన్న ఆధ్వర్యంలో వితరణగా ఇచ్చారు. ఇంజినీరింగ్ ఎంసెట్, గ్రూపు-1, 2, 4 పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలనుఅందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సోమన్న, యాదగిరి చార్యులు సంయుక్తంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని వాటిని వినియోగించుకుంటే మంచి ఫలితం ఉంటుందని అన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి గ్రంథాలయాలు చాలా తోడ్పాటును అందిస్తాయని తెలిపారు. విద్యార్థుల మేధో వికాసాన్ని పెంచుతూ వారిలో స్ఫూర్తిని నింపేందుకు పుస్తకాలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాల లైబ్రరీయన్ జాటోతు శంకర్ నాయక్, పుస్తక పాఠకులు మహమ్మద్ అమీర్, గుమ్మడవెల్లి పురుషోత్తం, బొమ్మరబోయిన వెంకన్నయాదవ్, ధారావత్ సోమన్న, అంజయ్య, వెంకన్న, భూసాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా గెలిపిస్తే సొంత నిధులతో అభివృద్ధి చేస్తా

## మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా నన్ను గెలిపిస్తే సొంత నిధులతో ఒక కార్పొరేట్ స్థాయి హాస్పిటల్, ఉన్నత స్థాయి విద్య ప్రమాణాలతో విద్య అందిస్తానని జంగా రాఘవ రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ ఫైన్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుపై మహిళలకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ప్రజల కనీస అవసరాలను పట్టించుకోవట్లేదని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, మహిళా తల్లుల ఆశీస్సులు తనకు ఉండాలని ఆయన కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇద్దరు తోడు దొంగలు కలిసి మన నియోజకవర్గానికి రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని రాకుండా చేస్తూ కాలం గడుపుతున్నారన్నారని విమర్శించారు. ఈ కోచ్ ఫ్యాక్టరీ వస్తే సుమారు పదివేల మంది పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ రెండు పార్టీల లోపాయికారి ఒప్పందంతో మన నగరానికి రావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులు రావట్లేదని విమర్శించారు. ఎలక్షన్స్ వస్తున్నాయని మళ్లీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ కొత్త వేషాలు, కొత్త డ్రామాల తో మిమల్ని మోసం చేయడానికి సిద్ధమవుతున్నాడని మండిపడ్డారు. ఈ అవినీతి ఎమ్మెల్యేను ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నం అయ్యిందని అన్నారు. మరో మోసపు పార్టీ బీజేపీ పై పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్యాస్, పెట్రోల్, నిత్యవసరాల ధరలు పెంచడంతో పాటు ఆయిల్ ధరలు పెంచి సామాన్య ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీని బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ మన తెలంగాణ ప్రజలు పడుతున్న కష్టాలు చూసి 6 గ్యారంటీ పథకాలు ప్రకటించారని చెప్పారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చల్లాకు తగిన గుణపాఠం తప్పదు



**వరంగల్ వాయిస్, పరకాల :** గీసుగొండ మండలం కేంద్రంలో 28వ రోజు ఇంటింటి బిజెపి ప్రచారంలో ప్రజలందరి ఆశీర్వాదంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. పెసరు విజయచందర్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిన్న పరకాల పట్టణానికి కేటీఆర్ వచ్చిన సమయంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలపై అవాకులు చేవాకులు మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. నీ స్థాయి ప్రధాని మోడీని విమర్శించే స్థాయి కాదని ఎద్దేవా చేశారు. ప్రజలు నీకు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. పరకాల నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, మండల అధ్యక్షుడు జాన్ విక్రమ్, అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ గట్టిగప్పుల రాంబాబు, ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరకట్ల ప్రవీణ్, జిల్లా కార్యదర్శి, మండల ఇంఛార్జి మొలుగూరి శ్రీనివాస్, 16వ డివిజన్ అధ్యక్షుడు గోదాసి అశ్విన్, 15వ డివిజన్ అధ్యక్షుడు బిళ్ళ రమేష్, బాలరాజు, వెంకన్న, రమేష్, యువమోర్చా మండల అధ్యక్షులు అడువల అఖిల్, ల్యాద రాజేష్, కుమార్, కత్తి రమేష్, కోట ఏలీయా, ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అరూరికి అండగా ముస్లింలు



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** ఎమ్మెల్యే అరూరి రమేష్ కు సబ్బండ వర్గాల ప్రజలు జై కొడుతున్నారు. వారం రోజులుగా నియోజకవర్గంలో గల్లీగల్లీ తిరుగుతూ వందల కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేస్తున్న అరూరికి జనం అండగా నిలుస్తున్నారు. ముచ్చటగా మూడోసారి గెలిపించుకుంటామని ప్రతిన బూనుతున్నారు. చిన్నా, పెద్దా, ముసలీ ముతకా అంతా అరూరి కారుకు జై కొడుతుండటంతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. తాజాగా పర్వతగిరి గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు అరూరి గెలుపులో మేమూ భాగస్వామ్యం అవుతామని, మా మద్దతు(ఓటు) అరూరి రమేష్ కేనని ఏకగ్రీవ తీర్మానం చేసి ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి కూడా తనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన సోదరులందరికీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ధన్యవాదాలు తెలియజేశారు. అభివృద్దే నా జెండా, అందరినీ కలుపుకొని పోవడమే గులాబీ పార్టీ ఎజెండా అని ఎమ్మెల్యేను అరూరి రమేష్ అన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతి సోమేశ్వర్ రావు, ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉప సర్పంచ్ రంగు జనార్దన్, శంశుద్దీన్, అంకూస్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

# మా భూమిని మాకు ఇప్పించండి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం గ్రామ శివారు చెరువు మత్తడి కింద సర్వే నెంబర్. 109/ఏ2లో గల ఒక్క ఎకరం భూమిని అన్నారం షరీఫ్ గ్రామ ముదిరాజ్ కులానికి చెందిన రంపే పుల్లయ్యకు పట్టా నెంబర్ 133ద్వారా 1995లో పట్టా దార్ పాసుపుస్తకం ఇవ్వడం జరిగింది. అప్పటి నుం%ఎతీ% ఆ భూమిని తన ముగ్గురు కుమారులు రంపే యాక నర్సయ్య, కొమ్మాలు, సోములుతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవనభృతి పొందుతున్నారు. గత కొద్ది సంవత్సరాల క్రితం పట్టాదారు రంపే పుల్లయ్య మరణించగా కొడుకు సోములు తన వాటా భూమిని వారసత్వంగా 109ఏ/2గా 13గుంటలు పట్టా నెంబర్ 465 తో పట్టాదారు పసుపుస్తకం మంజూరైంది. ఆ సమయంలోనే పెద్ద తండా, అన్నారం షరీఫ్ కు చెందింన అధికార పార్టీ నాయకుల కన్ను ఆ భూమి మీద పడి అమ్మమని పట్టదారున్నీ అడగగా అమ్మనని చెప్పాడు. ఎలాగైనా భూమి దక్కించుకోవాలనుకున్న సదరు నాయకులు వాళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని మండల స్థాయి రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసి ధరణి లో నమోదు కాకుండా, కొత్త పట్టాదారు పాసుపుస్తకం రాకుండా చేసి,పట్టాదారులను బెదిరిస్తున్నారని, ఆ భూమిలో పెద్ద తండా, అన్నారం షరీఫ్ కు చెందిన నాయకులకు కొంత భూమి ఇస్తే భూమి పట్టా చేయిస్తామని లేకుంటే పట్టా కానివ్వమని బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోయారు. బాధితులు న్యాయం కోసం హైకోర్టుకు వెళ్లగా నాలుగు వారాలలో వారి భూమిని వారికి చూపించి హద్దులు వేయాలని ఆర్డర్ ఇవ్వగా అప్పటి తహశీల్దార్, అధికార పార్టీ నాయకుల కొమ్ము కాస్తూ కాలయాపన చేసి ఆ భూమి బాధితులది కాదని వెల్లగొట్టారు. అధికారులకు అక్రమంగా తమ భూమిని ఆక్రమించి బిల్డింగు నిర్మిస్తున్నారని భూబాధితులు మంగళవారం ధర్నాకు దిగారు. తమ భూములు తమకే ఇప్పించాలని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధికి అండగా నియోజకవర్గ ప్రజలు

## ఎమ్మెల్యే అరూరికి మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల మున్నూరుకాపు కుల సంఘం ఎమ్మెల్యే అరూరి రమేష్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ను హనుమకొండ ప్రశాంత్ నగర్ లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి కూడా అరూరిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి నేటి వరకు రాష్ట్రం లో చేపట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. పని చేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. తాను ఎమ్మెల్యే గా ఎన్నికైన నాటి నుంచి వర్దన్నపేట నియోజకవర్గ అభివృద్దే ప్రధాన లక్ష్యంగా అహర్నిశలు పాటుపడుతున్నాని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు పార్టీ కోసం పని చేసే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నానని పేర్కొన్నారు. ప్రతీ రోజు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాలలో పలుపంచుకుంటూ వారికీ అండగా నిలుస్తున్నానని తెలిపారు. తనను నమ్మి వచ్చిన ప్రతీ కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతీ సోమేశ్వర్ రావు, ఎంపీటీసీ మాడుగుల రాజు, ఉప సర్పంచ్ రంగు జనార్దన్, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు డాక్టర్ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి బైరు రాజు, ఉపాధ్యక్షులు బుక్క కుమారస్వామి, కోశాధికారి బక్కి రాజు, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, గొల్లం రవి, బక్కీ సంజీవ, బక్కిశ్రీనివాస్, పిట్టల రంజిత్, బక్కి యాకయ్య ఉన్నారు.

## ఘనంగా గడ్డం కేశవమూర్తి జన్మదినం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జేఎన్ఐఎస్‌లో సీనియర్ జర్నలిస్టు, రచయిత గడ్డం కేశవమూర్తి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఉదయం జేఎన్ఐఎస్ తెలంగాణ బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన బ్యాడ్మింటన్ క్రీడాకారులంతా కలిసి గడ్డం కేశవమూర్తి చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా సమాజంలో క్రీయాశీలక పాత్ర పోషిస్తున్న గడ్డం కేశవమూర్తి మరిన్ని జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నిత్యం నవ్వుతూ, నవ్విస్తూ కలుపుగోలుగా ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతమని అన్నారు. ఈ కార్యక్రమంలో పోరిక విజయ్ కుమార్, అరోరా సంపత్, రాజు, పూజారి విజయ్, దేవేందర్ రెడ్డి, వేణు, రఘు, రాజు, రాజిరెడ్డి, పూజారి శ్రీనివాస్, తిరుపతి, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. గడ్డం కేశవమూర్తి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## రూ.7.65 లక్షల నగదు సీజ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఇంతెజార్ గంజ్, మట్టేవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతెజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 4.65 లక్షలు, మట్టేవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 3 లక్షల నగదు లభించినట్లు పోలీసులు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో మొత్తం రూ. 7.65 లక్షల నగదు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

### నర్సంపేటలో రూ. 1,15,000 నగదు సీజ్..

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ. 1.15లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నర్సంపేట ఎస్ఐ శీలం రవి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసే క్రమంలో ఖానాపురం నుంచి వస్తున్న కారులో ఈ నగదు లభించింది. దీనికి సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ తనిఖీలు నర్సంపేట ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గడపగడపకు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు



**వరంగల్ వాయిస్, రఘునాథ్ పల్లి :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని రఘునాథ్ పల్లి మండల కేంద్రం పరిధిలోని మల్లంపల్లి, శివాజీ నగర్, శ్రీమన్నారాయణపురం గ్రామాలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి స్టేషన్ ఘనపుర్ ఇంచార్జి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను గడపగడపకు కాంగ్రెస్ నాయకులు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. గ్రామ ప్రజలు, మహిళలు రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి నరేందర్, కోళ్ల రవి గౌడ్, జనగామ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు, రఘునాథపల్లి ఇంచార్జి లోకుంట్ల ప్రవీణ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూరి పృథ్వీ, భాస్కర్ రాజ్ కుమార్, రఘునాథపల్లి మండల మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ ఉషా రవి, లావణ్య రెడ్డి, నారాయణపురం ఎంపీటీసీ తుడి విజయ సుదర్శన్, గ్రామ పార్టీ అధ్యక్షులు లోని సోమాజి, తాళ్లపల్లి మనోహర్, కిషన్, గల్లూరి భిక్షపతి, లోన రవి, కొలిపాక మల్లేష్ , గౌరగళ్ల బాలు, కొలిపాక మహేష్, శ్రీకాంత్, వార్డు మెంబర్లు, మాజీఎంపీటీసీలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి గజానంద్ సస్పెన్షన్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల ప్రకారం తొర్రూరు మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ నరుకుటి గజానంద్ ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు బీఆర్ఎస్ పట్టణ కమిటీ ప్రకటించింది. బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసి మంత్రి ఆదేశాలతో పార్టీ నుంచి సస్పెండ్ చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మంగళంపల్లి రామచంద్రయ్య, జడ్పీటీసీ జిల్లా ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జినుగా సురేందర్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎండీ జలీల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్ల జంపన్న, ఎనిమిదో వార్డు నాయకులు అల్లం అర్జున్ రాజు, బీఆర్ఎస్ పార్టీ 8వ వార్డు ప్రధాన కార్యదర్శి రెబెల్లి కృష్ణమూర్తి, పస్తం శ్యాంసుందర్, పట్టణ బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి తూర్పాటి మెండిస్, తూర్పాటి సుభాష్ , ఎండీ మాలిక్, సంతోష్, విజయ్,పేర్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను గద్దె దించాలి

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** యువత కేసీఆర్‌ను గద్దె దించి, కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ అన్నారు. బాపూనగర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాదావత్ భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియమ్మ ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలను ఇంటింటికి తిరుగుతూ ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలను గడప గడపకి వెళ్లి వివరించారు. మహాలక్ష్మి పథకం మహిళలకు ప్రతి నెల 2,500, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసాగా రూ. 2లక్షల రుణమాఫీ, ప్రతి ఏటా రైతులకు కౌలు రైతులకు ఎకరానికి రూ. 15,000, వ్యవసాయ కూలీలకు రూ. 12,000, వరి పంటకు రూ. 500 బోనస్, గృహ జ్యోతి క్రింద ప్రతి కుటుంబానికి రూ. 200యూనిట్లు ఉచిత విద్యుత్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, రూ. 5 లక్షలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, యువ వికాసం క్రింద విద్యార్థులకు రూ. 5లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్, రూ. 4000 నెలవారీ పింఛన్, రూ. 10లక్షలు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు ప్రతినెల రూ. 4వేల నిరుద్యోగ భృతి కల్పిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఈ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ మాట ఇస్తే చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మద యాకయ్య గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, అమీనాబాద్ సర్పంచ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్, శంకరాం తండా గ్రామ సర్పంచ్ భద్రు నాయక్, మాజీ ఎంపీటీసీ బిళ్ల ఇంద్రసేనా రెడ్డి, మండల నాయకులు భూక్య మోహన్ నాయక్, యూవజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, పత్తినాయక్ తండా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రవి నాయక్, హనుమ నాయక్, రాజేందర్, రాజా, బాలాజీ, కొర్రలచ, బాలు, రవి, సాంక్రి, దేవేందర్, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి పథకాన్ని పూర్తి చేయాలి

### డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వైద్య ఆరోగ్య శాఖలో ఆరోగ్య శాఖ మంత్రి నిర్దేశించిన ప్రతి పనిని సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం ప్రాథమిక అరోగ్య కేంద్రంలో అరోగ్య మహిళ డే కార్యక్రమాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో మొదలు పెట్టిన అన్ని కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నందున ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రత్తలు చెప్పాలని, జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక అరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గ్రామాలలో ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్యాధికారికి సూచించారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గ్రామాలలో మానసిక సమస్యలతో బాధ పడుతున్న బాధితులకు టోల్ ఫ్రీ నంబర్ 14416 కి కాల్ చేసి వారి సమస్యలను దూరం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్, వైద్యాధికారి సరోజ, సీహెచ్ఓ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

# గురుకుల వైద్య సిబ్బందికి న్యాయం చేయాలి

**హోదా పెంపుతో పాటు ప్రమోషన్స్ ఇవ్వండి**

**తెలంగాణ ఇండియన్ మెడిసిన్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యం, కార్యదర్శి డాక్టర్ బి.ఆంజనేయులు**





**వరంగల్ వాయిస్, జనగామ :** తెలంగాణ ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న సిబ్బందికి మరింత గౌరవం తీసుకువచ్చేలా, హోదాలో మార్పులు చేస్తూ స్టాఫ్ నర్సులకు నర్సింగ్ ఆఫీసర్ హోదాను కల్పించి, హెడ్ నర్సులకు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లుగా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 అని, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ గా, నర్సింగ్ సూపరింటెండెంట్-1ను, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ గా హోదాను మారుస్తూ జీవో విడుదల చేశారు. అలాగే గత 25 ఏళ్ల నుంచి స్టాఫ్ నర్స్ హోదాతో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలో పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందిని కూడా హోదా పెంపుతో పాటు ప్రమోషన్స్ ఇవ్వాలని తెలంగాణ ఇండియన్ మెడిసిన్ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యం, కార్యదర్శి డాక్టర్ బి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో తెలంగాణ గవర్నర్ తమిళ్ సైని కలిసి వినతిపత్రం కూడా అందజేశామని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలలో వైద్య సిబ్బందిని సెలవులు లేకుండా 24 గంటలు పని చేయించుకుంటున్నారు. కాబట్టి డాక్టర్లకు సహాయంగా యంపీహెచ్ డబ్ల్యు లేక ఏఎన్ ఎం అర్హతలతో ఒకరిని నియమించాలని వారు కోరుతున్నారు. ప్రతీ విద్యాలయంలో 600 నుంచి 800 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తారు. ఈ జనాభా ఒక్క గ్రామానికి సమానం. డిస్ట్రిక్ డీసీఓ మాదిరిగా, డిస్ట్రిక్ హెల్త్ ఆఫీసర్ ఇవ్వాలని, అర్హత కల్గిన మెడికల్ గ్రాడ్యుయేట్స్ (బీఎంఎంఎస్, బీహెచ్ఎంఎస్ ) పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కు మెడికల్ ఆఫీసర్ హోదాను ఇవ్వాలని అడుగగా, 2009లో ఇచ్చారు. పేస్కేల్ అడిగిన పాపానికి ఇచ్చిన మెడికల్ ఆఫీసర్ హోదాను 2010లో తీసివేశారు. రీజినల్ లేవల్ లో, రీజనల్ హెల్త్ ఆఫీసర్ (ఆర్ హెచ్ ఎస్ఓ)గా ఇచ్చి సేవలను తీసుకోవాలి. 2017లో ఆర్ హెచ్ ఎస్ ఓగా ఇచ్చి 5ఏళ్లు, ఆర్ సీఓ ఆఫీస్ నుంచి రీజనల్ లోని అన్ని విద్యాసంస్థలకు వైద్య సేవలను సూపర్ విజన్ చేయడం జరిగింది. ఇప్పుడు మళ్లీ అదే విధంగా సేవలను తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మెడికల్, హెల్త్ డిపార్ట్ మెంట్ల లో మాదిరిగా ప్రమోషన్లు పేస్కేల్స్ వర్తింపజేయాలన్నారు. సీనియార్టీ ప్రకారంగా స్టాఫ్ నర్సులకు గ్రేడ్-1 నర్సింగ్ ఆఫీసర్, బీఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ చేసిన వారికి నర్సింగ్ ఆఫీసర్, సీనియర్ ఆయూష్ డాక్టర్లను హెడ్ ఆఫీస్ లో సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి తగిన వేతనాలు ఇచ్చి, అన్నీ గురుకులాలను ఒకే గొడుగు క్రిందకు తీసుకురావాలని, డైరక్టరేట్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఆరు నెలల క్రితం పంట నష్టపరిహారం ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు నష్టపరిహారం ఇవ్వడం లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ శ్రీనివాస్ నాయక్ విమర్శించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో అనేక గ్రామాల్లో భారీ ఎత్తున మొక్కజొన్న, వరి, పత్తి పంటలను రైతన్నలు పెద్ద ఎత్తున నష్టపోయారని శ్రీనివాస్ నాయక్ అన్నారు. తక్షణమే నష్టపరిహారం చెక్కులు వ్యవసాయ శాఖ అధికారులు రైతుల దగ్గరికు వెళ్లి వారికి పరిహారం అందించాలని శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. కిసాన్ మండల ఉపాధ్యక్షుడు సురేందర్ రావు, కిసాన్ ప్రధాన కార్యదర్శి రమేష్, సీనియర్ నాయకులు కంటెం సుధాకర్, కంది కట్ల అశోక్, మంగ నాయక్ యాకోబ్, బోట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# యూత్ సభ్యులకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని నరసింహులగూడెం, కాస్యతండా గ్రామలలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ సతీమణి డా.సీతామహాలక్ష్మీ చేతుల మీదుగా గృహాలక్ష్మి లబ్దిదారులకు పట్టాలు, బతుకమ్మ చీరలు, యూత్ సభ్యులకు స్పోర్ట్స్ కిట్లు అధికారులతో కలిసి పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి, కేసీఆర్ మనకు దొరకడం ఒక ఎత్తు అయితే, మహబూబాబాద్ నియోజకవర్గానికి శంకర్ నాయక్ ఉండటం మన అదృష్టమని పలువురు రాజకీయవేత్తలు ఎమ్మెల్యే శంకర్ నాయక్ ను, సతీమణి సీతామాలక్ష్మిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కోఆర్డినేటర్ భూక్య బాలాజీ, జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి నవీన్ రావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు పరిపాటి వెంకట్ రెడ్డి, వెన్నకుల శ్రీనివాస్, మండల రైతు కోఆర్డినేటర్ వేంకటేశ్వర్ రెడ్డి, దేవేందర్ రావు, భీముడు, బత్తిని అనిల్, విజయ్ యాదవ్, భోజ్య నాయక్, గ్రామ సర్పంచ్ ఉప్పలయ్య, ఎంపీటీసీ కృష్ణ, పెద్దలు వంగ నర్సింహా రెడ్డి, తండా నర్సయ్య, గుట్టయ్య, సర్పంచ్ బుజ్జి వెంకన్న, శ్రీను, మంగిలాల్, గ్రామ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# జాతీయ విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

**సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సులో వక్తల డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, జాతీయ విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ శక్తుల నుంచి కాపాడుకోవడం కోసం రైతులు పండించిన పంటలకు కనీస మద్దతుధరల గ్యారంటీ చట్టాన్ని చేసి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని ఏఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్య పద్మ, ఏఐకెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) ఆధ్వర్యంలో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల వరంగల్ జిల్లా సదస్సు శివనగర్ లో గల కుసుమ రఘునాథ్ భవనంలో రైతు సంఘాల జిల్లా బాధ్యులు పి.కృష్ణారెడ్డి, ఎండీ ఇస్మాయిల్, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, ఓదేల రాజన్న అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్కేయం ఆధ్వర్యంలో కార్పొరేట్ శక్తుల నుంచి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని, జాతీయ విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగంలో రైతులు పండిస్తున్న పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని 2020 నుంచి పెద్ద ఎత్తున రైతాంగ ఉద్యమం కొనసాగిందని, ఉద్యమ ఒత్తిడికి లొంగి నరేంద్ర మోడీ ప్రభుత్వం రాతపూర్వక హామీతో ఢిల్లీ పోరాటం తాత్కాలిక విరమణ జరిగిందని వారన్నారు.రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర చట్టాన్ని చేయడం కోసం రైతు సంఘాల నుంచి ప్రతినిధులుగా ఎంపిక చేసి కేంద్రం చర్చించి రైతాంగానికి న్యాయం చేస్తుందని హామీని ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ మెగా మోసానికి పాల్పడుతున్నాడని దుయ్యబట్టారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మందసౌర్ మార్కెట్లో రైతులని కాల్చి చంపిన బీజేపీ పాసిస్టు పాలనను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతాంగం ఏఐకెఎస్ సీసీ గా , ఎస్ కే యం గా ఏర్పడి 500పైగా రైతు సంఘాలు కార్మిక సంఘాలు 14 నెలలపాటు రోడ్డుపై బైఠాయించిన చారిత్రాత్మక రైతాంగ ఉద్యమమని వారు కీర్తించారు. ఈ మహత్తర రైతాంగ ఉద్యమం ప్రపంచ చరిత్రలోనే నిలిచిపోతుందని, అనేక అనేక పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని వారు అన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు చట్టాలతో పాటు, విద్యుత్ బిల్లు వల్ల దేశంలో ప్రత్యక్ష భాగస్వాములైన రైతాంగం 14 కోట్లకు పైగా, వ్యవసాయ కార్మిక వర్గం 15కోట్లకు పైగా, వీరితో పాటు పరోక్షంగా 30కోట్లకు పైగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న అందరి బతుకులు రోడ్డున పడేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ నల్ల చట్టాలను తీసుకువచ్చిందని వారు విమర్శించారు. కరోనా కాలంలో కూడా ప్రాణాలకు తెగించి 750 మంది రైతులు బలిదానాలు చేశారన్నారు. నరేంద్ర మోడీ మోసపూరిత విధానాలను ఎండగడుతూ ఢిల్లీ కేంద్రంగా 2023 నవంబర్ 26, 27, 28 తేదీలలో మరో రైతాంగ పోరాటానికి శ్రీకారం చుట్టాలని ఎస్కేయం నిర్ణయించిందని వారన్నారు. సమావేశానికి ముందు హరిత విప్లవ పితామహుడు రైతుల శ్రేయోభిలాషి అమరజీవి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కు నివాళు లర్పించారు.

**ఎస్కేయం జిల్లా కన్వీనర్ల ఎన్నిక..**

రైతు సంఘాల జిల్లా సదస్సులో సంయుక్త కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా కన్వీనర్లుగా ఈసంపల్లి బాబు, కుసుంబా బాబురావు, వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, ఓదెల రాజన్న, భూక్య సమ్మయ్య, మంద రవిలతో పాటు మరికొన్ని సంఘాల బాధ్యులను కలుపుకొని కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎస్కేయూ రాష్ట్ర నాయకులు మూడు శోభన్ నాయక్, జిల్లా నాయకులు నాగెల్లి కొమురయ్య, నెట్టెం నారాయణ, కోరబోయిన కుమారస్వామి, సింగతి మల్లికార్జున్, ఊరటి అంశాల రెడ్డి, పీరయ్య, సారంగపాణి, ఐతం నాగేష్, ప్రేమలత, గోవర్ధన్, తదితరులతో పాటు రైతు సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవ వికాసానికి మానసిక ఆరోగ్యమే కీలకం

**సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్**




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మానవ వికాసానికి మానసిక ఆరోగ్యమే కీలకమని, రోగానికి మూలం మనసేనని, డాక్టర్లు మందులు ఇవ్వడం తగ్గించి, మందలించడం నేర్చుకోవాలని సైకాలజిస్ట్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు . ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో తెలంగాణ సైకాలజిస్టుల సంఘం (టీపీఏ)ఆధ్వర్యంలో అడ్వకేట్స్ కాలనీ లోఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ అశోక్ పాల్గొని మాట్లాడుతూ శాంతితో మన హృదయాలు నిండినప్పుడు, అది కోపం, మానసిక ఆందోళన, ఆత్రుత, ఆవేశం అనే సమస్యలను నివారిస్తుందన్నారు. ఇంతకాలం మనం గుడ్డిగా నమ్ముతున్న అనేక ఆరోగ్య సమస్యలకు మూలాలు-మనం తీసుకునే ఆహారంలో లేవన్నారు. మనం జీవించే విధానంలోనే ఉన్నాయని తెలిపారు. మనసును హాయిగా ఉంచుకున్న వారికి ఏ రోగాలు రావని ఆధునిక పరిశోధనలు నిర్ధారించాయని తెలిపారు. జీవనశైలిని మార్చుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మేలని, స్వార్థం, కోపం, ద్వేషం, శత్రుత్వం, ఆవేశం, అసూయ, మొండితనం, బద్ధకం, విచారం వంటి వ్యతిరేక భావాలను వదిలించుకొని కారుణ్యం, త్యాగం, శాంతం, క్షమ, నిస్వార్థం, స్నేహభావం, సేవ భావం, కృతజ్ఞత, హాస్య ప్రియత్వం, సంతోషం లాంటి సానుకూల దృక్పథాలు పెంచుకొని హాయిగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెనగంటి శుభ, సహజ, సౌభాగ్య, లక్ష్మి, వీరస్వామి, నవిత, హరి కిషన్, రాజు, వెంకన్న, రాజన్నతదితరులు పాల్గొన్నారు.

# ప్రచార శంఖారావం పూరించిన గండ్ర



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి మండలం గుడాడ్పల్లి గ్రామంలో రెండు పడకల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని ఇండ్లకు వచ్చిన గ్రామ ప్రజలు మంగళవారం భూపాలపల్లి శాసన సభ్యుడు గండ్ర వెంకట రమణా రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జడ్పీ వైస్ చైర్మన్ కల్లెపు శోభ రఘుపతి రావు, ఎంపీపీ మందల లావణ్య విద్యా సాగర్ రెడ్డి లను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం వారు గుడాడ్ పల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో గండ్ర దంపతులు సరదాగా మాట్లాడారు. గతంలో ఉండే పాలనకు, నేడు కేసీఆర్ పాలన పట్ల ప్రజలు ఆలోచించాలన్నారు. ఎన్నో పోరాటాల నడుమ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజల్లో సానుకూల స్పందన, పూర్తి విశ్వాసం ఉందన్నారు. రైతులకు రైతు బంధు, రైతు భీమా, ఉచితంగా 24గంటల విద్యుత్తు, అందుబాటులో ఎరువులు, గిట్టుబాటు ధరలు, కేంద్రం సహకారం ఇవ్వకపోయినా రైతు కేంద్రాలలో వడ్ల కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కొనియాడారు. గుడాడ్ పల్లి గ్రామంలో గతంలో ఏ ఎన్నిక జరిగిన బీఆర్ ఎస్ పార్టీ అత్యధిక మెజారిటీ లభించిందన్నారు. ఇప్పుడు గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. గుడాడ్ పల్లి గ్రామంలో పార్టీ అభిమాని ఇంట్లో వారు కలిసి భోజనం చేశారు. తమ గ్రామం నుంచే ఎన్నిక ప్రచారం ప్రారంభించిన గండ్ర దంపతులను కల్లెపు శోభ రఘుపతి రావు దంపతులు ప్రత్యేకంగా సన్మానించి, వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ ఉడుత లక్ష్మీ ఐలయ్య, ఎంపీటీసీ పాటురి సంధ్య, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

# భద్రతా బలగాల వసతి ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మహబూబాబాద్ మరిపెడ, డోర్నకల్ మండల కేంద్రాలలో రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో విధుల నిర్వహణ కోసం బందోబస్తు కు సీఆర్పీఎఫ్ బలగాల వసతి ఏర్పాట్లపై జిల్లా పాలనాధికారి శశాంక, ఎస్పీ జి.చంద్రమోహన్ తో కలిసి పరిశీలించారు. మరిపెడ మండల కేంద్రంలోని తెలంగాణ బాలుర ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి పరిశీలించి సీఆర్పిఎఫ్ సిబ్బంది ఉండటానికి వసతుల కోసం ప్రస్తుతం ఉన్న విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వేరే భవనానికి తరలించే విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ప్రత్యేకమైన కాంపౌండ్ ఏర్పాటు చేయాలని అవసరమైన కరెంట్, టాయిలెట్స్, మిషన్ భగీరథ నీటి సరఫరా, కార్పెంటర్ పనులలో ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేసి వసతిని ఏర్పాటు చేసి నెలాఖరులోగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డోర్నకల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించి అనువైన కేంద్రాన్ని చూడాలని అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ పట్టణంలోని హస్తినాపురం వద్ద ఎస్సీ బాలుర సంక్షేమ కళాశాల వసతి గృహాలను పరిశీలించి భవనానికి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ ఉన్న విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అన్ని వసతులు ఉన్న ప్రత్యామ్నాయ వసతి గృహానికి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీల్లో తొర్రూర్ డీఎస్పీ జి.వెంకటేశ్వరబాబు, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు అలివేలు, నరసింహారావు, ఆర్సీఓ ట్రైబల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, తొర్రూరు, డోర్నకల్ మున్సిపల్ కమిషనర్లు ప్రసన్నారాణి, మహబూబాబాద్, మరిపెడ, డోర్నకల్ తహసీల్దార్లు సైదులు, నాగభవాని పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం

### బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం కేసీఆర్ తోనే సాధ్యమని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని మాజీ ఉప ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం రఘునాథపల్లి మండలం మండేలాగూడెం ఆర్ఆర్ బంగ్లా మేకల గట్టు జాఫర్ గూడెం గ్రామాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి తనదైన శైలిలో చేసి చూపిస్తానని కడియం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఏకైక వ్యక్తి ఉమ్మడి జిల్లాలో మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు ఉందని ఆయన వివరించారు. అవినీతికి పాల్పడితే ప్రజలు తనని చీకొట్టాలని, రాజకీయ జీవితంలో ఎక్కడా కూడా అవినీతి అక్రమాలకు భూకబ్జాలకు పాల్పడలేదని ఆయన తెలిపారు. కడియం శ్రీహరి అంటే కడిగిన బంగారమని పేర్కొన్నారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశానని ఆయన చెప్పుకొచ్చారు. గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని, కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి చెందిందని ఆయన తెలిపారు. ఒకసారి అవకాశం ఇవ్వండి ప్రజలకు సేవ చేస్తానని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బోల్లం అజయ్ మణికంఠ, మాజీ జడ్పీటీసీ సభ్యులు మారుజోడు రాంబాబు, లక్ష్మణ్, హుస్సేన్ నాయక్, గట్టేశం, శివకుమార్, గుప్తా పోకల, సర్పంచులు బొక్క యాదగిరి యాదవ్, సంధ్య కిరణ్, ఉత్తర సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు వారాల రమేష్, బుచ్చయ్య, హరీష్ గౌడ్, మండల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## జంగా రాఘవరెడ్డి ఖబర్దార్.!



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మర్రి యాదవ రెడ్డి మాట్లాడుతూ జంగా రాఘవరెడ్డి నిన్న మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మీద చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డి మీ మధ్య ఉన్న గొడవల్లో మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ను కలుపుకొని రాజేందర్ రెడ్డి తో కుట్రపన్ని రాజేందర్ రెడ్డి మనుషులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పెట్టించాడనడం సిగ్గుచేటన్నారు. మీ కాంగ్రెస్ పార్టీలో మీ ఇద్దరి మధ్య ఉన్న అంతర్గత విభేదాలలో మంత్రి ఎర్రబెల్లికి గాని, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కు ఏంటీ సంబంధం అని ప్రశ్నించారు. ఓటమి ఎరుగని నాయకులపై నీవు చిల్లర మాటలు మాట్లాడడం మానుకోవాలని హెచ్చరించారు. 2018 ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం లో నియోజకవర్గ ప్రజలు చీకొడితే జనగామకు పారిపోయి, జనగామ నుంచి మళ్లీ పశ్చిమ నియోజకవర్గం వచ్చి అల్లర్లు సృష్టించి, అశాంతి నెలకొల్పి, ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న నీకు ప్రజలే గట్టిగా బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ బజార్ డైరెక్టర్ గుర్రాల ప్రభాకర్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు రెంటాల కేశవ రెడ్డి, కోయగూర వెంకటరంగా రెడ్డి, సుగుణాకార్ రెడ్డి, చాడా నేపాల్ రెడ్డి, పెద్దిరెడ్డి రవీందర్ రెడ్డి, పెండ్యాల శ్వేతా రెడ్డి, నల్ల సుధాకర్ రెడ్డి, తుమ్మేటి జయపాల్ రెడ్డి, వెలపాటి హేమ్ సుందర్ రెడ్డి, శ్యామ్ ప్రసాద్ రెడ్డి తదితులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** డబుల్ ఇంజిన్ సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్ రావు తెలిపారు. తొర్రూరులో స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ క్రీయాశీలక పాత్ర పోషించి తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిందని, కానీ కేసీఆర్ కుటుంబం మాత్రమే తెలంగాణ తెచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ ప్రపంచంలో అగ్ర దేశాల సరసన చేర్చారని తెలిపారు. భారత్ ను విశ్వ గురువుగా చేయాలనే సంకల్పంతో ఢిల్లీ వేదికగా జి20దేశాల సదస్సుకు మోడీ నాయకత్వం వహించి ఆ దిశగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఓటమి ఎరుగని ధీరుడని గొప్పలు చెప్పుకునే ఎర్రబెల్లి దయాకర్ రావు సంతలో పశు వులను కొన్నట్లు పక్క పార్టీ వాళ్లను కొనుక్కోవడం సిగ్గుచేటని, నైతిక విలువలు లేకుండా కేవలం అధికారమే పరమావధిగా రాజకీయాలు చేస్తూ విచ్చలవిడిగా డబ్బు, మద్యం, ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తూ ఎర్రబెల్లి దయాకర్ రావు గెలవడం కోసమే దుష్ట రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, గారడీ విద్య లు ఎన్ని ఆడినా, ఎంత మంది పక్క పార్టీల వాళ్లను కొనుక్కున్నా, కోవర్ట్ లను ఎంత మందిని పెట్టుకున్నా ఈసారి ఎర్రబెల్లికి పాలకుర్తి ప్రజల చేతిలో ఓటమి తప్పదని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా మహబూబాబాద్ పార్లమెంటు ఇంచార్జి అలిసేరి రవిబాబు, ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, అర్బన్ ఉపాధ్యక్షుడు నడిగడ్డ ఉపేందర్, అర్బన్ కార్యదర్శి జలగం రవి, తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యనగర్ రైలులో పోలీసుల తనిఖీలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని తెలపడంతో రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమలవుతోంది. దీంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం భాగ్యనగర్ రైల్ లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాజీపేట ఎస్సై రాజు ఆధ్వర్యంలో కాజీపేట, ధర్మసాగర్ పోలీసు సిబ్బంది ఉమ్మడిగా కాజీపేట నుంచి జమ్మికుంట వరకు ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు. ప్రయాణికులు ఏదైనా డబ్బులు కానీ ఇతరత్రా వస్తువులు కానీ తమ వెంట తీసుకెళ్తే సరైన పత్రాలు చూపించాలన్నారు.



## పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఎన్నికల విధుల్లో భాగంగా మంగళవారం స్థానిక పాల కేంద్రం వద్ద తొర్రూరు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సైలు జగదీష్ ,రాంజీ నాయక్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా బస్సులో వెళ్తున్న ఒక వ్యక్తి వద్ద మూడున్నర లక్షలు పట్టుబడ్డాయి. కారులో వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి ఒక లక్ష రూపాయలు, బైక్ పై వెళ్తున్న వ్యక్తి వద్ద 10 గ్రాముల బంగారం, 750 గ్రాముల వెండి ఆభరణాలను ఎలాంటి ఆధారాలు లేనందున స్వాధీనపరచుకొని డిస్టిక్ మానిటరింగ్ ఆఫీసర్ కు అప్పగించడం జరిగిందని ఎస్ ఐ జగదీష్ తెలిపారు.

## డాక్టర్ శ్రీకాంత్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక మున్సిపల్ కేంద్రంలో కంటాయపాలెం రోడ్డులో గత 16 సంవత్సరాల నుంచి సుదీర్ఘకాలంగా ఎంతోమంది పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ ను నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్, కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వారు చేస్తున్న మంచి కార్యక్రమానికి మా ఆర్గనైజేషన్ నుంచి సపోర్ట్ ఉంటుందని ఈ సందర్భంగా డివిజన్ కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. విద్య, వైద్య, ఆరోగ్యం, న్యాయ సేవ మార్పు కోసం ఎవరు పని చేసినా మేము వారి వెంట ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పల్లెర్ల రమేష్, డిస్టిక్ సోషల్ సర్వీస్ గారే వీరస్వామి, మహబూబాబాద్ జిల్లా ఉమెన్స్ జాయింట్ సెక్రెటరీ గాదెకృష్ణ, డివిజన్ కమిటీ నెంబర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.





- గడ్డం కేశవమూర్తి

# కాంగ్రెస్ బీసీ జపం
# బైరి రవికృష్ణ గౌడ్ వైపు చూపు..

## పరకాలలో బలమైన నేతను నిలిపేందుకు స్కెచ్
## బలహీన వర్గాల సానుభూతి కోసం కసరత్తు

కాంగ్రెస్ పార్టీ బీసీ జపం చేస్తోంది.. తెలంగాణలో ఎక్కువ శాతం ఓటు బ్యాంకు కలిగిన బీసీలను తమవైపు తిప్పుకునేందుకు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా కొన్ని నియోజకవర్గాల్లో బీసీనేతలకు టికెట్ లు ఇచ్చి సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తోంది. కొద్దికాలంగా బహుజన, బీసీ నినాదాలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఈసారి పరకాల కాంగ్రెస్ టికెట్ బీసీ వర్గాలకు కేటాయిస్తే ఎలా ఉంటుందని కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ పేరు తెరమీదికొచ్చింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర, జాతీయ నేతలు ఆయనతో చర్చలు జరిపినట్లు సమాచారం.

### ఎన్నికల బరిలో బైరి..

పరకాల కాంగ్రెస్ పార్టీలో పరిణామాలు రోజురోజుకు మారుతున్నాయి. కొద్దికాలంగా బహుజన, బీసీ నినాదాలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పరకాల కాంగ్రెస్ టికెట్ ను బీసీ వర్గాలకు కేటాయించేందుకు పార్టీ శ్రేణులు సమాలోచన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ పేరు తెరమీదకు వచ్చింది. బీసీ వర్గాలకు టికెట్ ఇస్తే.. సులభంగా గెలవవచ్చుననే అంచనాళ్ పార్టీ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. సుమారు దశాబ్దకాలంగా బీసీ వర్గాల హక్కుల కోసం, సంక్షేమం కోసం పోరాడుతున్న నాయకుడిగా బైరి రవికృష్ణగౌడ్ కు మంచి గుర్తింపు ఉంది. ఇటీవల గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన గౌడ గర్జన సభతో ఆయన తన సత్తా చాటుకున్నారు. గౌడ సంఘాల జేఏసీ సభతోనే రవికృష్ణగౌడ్ పేరును కూడా కాంగ్రెస్ పార్టీ పరిశీలనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పరకాల రాజకీయాలు రోజురోజుకూ అత్యంత ఆసక్తికరంగా మారుతున్నాయి. కాంగ్రెస్ లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలనే వాదన బలంగా వినిపిస్తుండటంతో పరకాల నుంచి బైరి రవికృష్ణగౌడ్ ను పోటీ చేయించేందుకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది.

### కాక రేపుతున్న పరకాల రాజకీయం

మేమెంతో మాకన్ని సీట్లు.. అంటూ బీసీ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్లతో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లు కొంత ఆందోళనకు గురవుతున్నాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ 22మందికి మాత్రమే బీసీలకు సీట్లు కేటాయించగా... కాంగ్రెస్ ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్ లో రెండు అసెంబ్లీ స్థానాలు అంటే 34 సీట్లు ఇచ్చేందుకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో బీసీవర్గాలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో బీసీ నాయకులకు టికెట్లు ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పరకాల కాంగ్రెస్ టికెట్ ను బీసీ నేత బైరి రవికృష్ణగౌడ్ ఆశిస్తున్నారు. ఈ మేరకు పార్టీ నేతలతో ఆయన చర్చలు జరుపుతున్నారు. పరకాల నియోజకవర్గంలో గౌడ సామాజికవర్గం ఓట్లు సుమారు 35 వేలకు పైగానే ఉన్నాయి. ఈ ఓట్లతో పాటు బీసీ సామాజిక, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లు కూడా తోడైతే గెలుపు సులభమేనని అధిష్ఠానం భావిస్తోంది.

### మరీ.. ఇనగాల పరిస్థితేంటి ?

ఈ పరిణామాలో పరకాల నియోజకవర్గ రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇప్పటికే పరకాల కాంగ్రెస్ నేత ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తనకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూ, కార్యకర్తలతో కలిసి పోతున్నారు. తాజాగా కొండా మురళీ పోటీచేసేందుకు ఆసక్తి చూపడం, బీసీ సామాజికవర్గానికి చెందిన బైరి రవికృష్ణ గౌడ్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండడంతో పరకాల రాజకీయం ఆసక్తికరంగా మారింది. బీసీలతో పాటు అన్ని సామాజిక వర్గాల ప్రజలను కలుపుకుపోతూ పదేళ్లుగా బహుజన నేతగా గుర్తింపు పొందిన రవికృష్ణగౌడ్ పేరు తెరపైకి రావడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అభ్యర్థి ఎంపిక విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఇనుగాల వర్గం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.








### గెలుపే లక్ష్యం అధిష్ఠానం అడుగులు..

పరకాల నియోజకర్గంలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అడుగులు వేస్తోంది.. బీసీవర్గాలకు టికెట్ ఇస్తే.. సులభంగా గెలవవచ్చుననే అంచనాలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు దశాబ్దకాలంగా బీసీవర్గాల హక్కుల కోసం, సంక్షేమం కోసం పోరాడుతున్న నాయకుడిగా బైరి రవికృష్ణగౌడ్ కు మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ఆయనకు సీటిస్తే పరకాలలో గెలవడమే కాకుండా గౌడ సామాజిక వర్గ ఓట్లు ఇతర నియోజకవర్గాలలో తమకు పడే ఛాన్స్ ఉంటుందని పార్టీ ఆలోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే రవికృష్ణగౌడ్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

### బయోడేటా..

పేరు : బైరి రవికృష్ణ గౌడ్
పుట్టిన తేది : 06-02-1966
చదువు : గ్రాడ్యుయేషన్
తల్లిదండ్రులు : బాలయ్య, సుశీల
భార్య పేరు : శారద
పిల్లలు : కుమారుడు, కూతురు
కులం : గౌడ (బీసీ)
వృత్తి : ఆర్ఆర్ డెవలపర్స్ ఎండీ
నివాసం : ప్రశాంత్ నగర్, హనుమకొండ



### రవి కృష్ణ గౌడ్ నేపథ్యం..

హనుమకొండ ప్రశాంత్ నగర్కు చెందిన బైరి రవికృష్ణ గౌడ్ బీసీ సంఘం నేతగా గుర్తింపు పొందారు. ఆయన తెలంగాణ బీసీ సంక్షేమ సంఘంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, వర్కింగ్ ప్రెసిడెండ్గా అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడిగా 2022 నుంచి కొనసాగుతున్నారు. అలాగే 2016 లో తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడిగా, వరంగల్ జిల్లా గోపాకు సలహాదారుడిగా పనిచేశారు. గౌడ సంఘం జేఏసీ చైర్మన్గా కొనసాగుతున్నారు. సేవాభావం కలిగిన ఆయన పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బ్లడ్ డోనేషన్ క్యాంపులు ఏర్పాటు చేసి రక్తదానం, వృద్ధులకు, పేదలకు అండగా నిలువడంపై సహాయం అందించారు. అయితే తాను రాజకీయ రంగ ప్రవేశం చేసి ప్రత్యక్షంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడాలని కృత నిశ్చయంతో ముందుకు అడుగులు వేస్తున్నారు. అందుకు పేదల పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి పరకాల నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.





# ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

## ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల ప్రవర్తన నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కాలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ రవీందర్ తో కలసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, ఎన్నికల నియమావళిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 4న ఓటరు తుది జాబితాను ప్రచురించామని వెల్లడించారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాల్లో మొత్తం 7,33,454 మంది ఓటర్లు, 590 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం 7 ద్వారా దరఖాస్తూ చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘనకు పాల్పడరాదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను ఎప్పటి కప్పుడు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎన్నికలకు సంబంధించిన ఉల్లంఘనలు, సందేహాలు ఉంటే సంప్రదించాలన్నారు. కంట్రోల్ రూమ్ వివరాలను మీడియా ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయడం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి ప్రచార సంబంధిత అంశాలు ఉండరాదన్నారు. ఓటరు జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించడం జరుగుతుందని, ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టే ముందు సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు.

అసంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి రూ.40 లక్షల వరకు ఖర్చు పరిమితి ఉందని, ఖర్చుచేసే ప్రతి పైసా ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తీసి అందులోనుంచే ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల ఖర్చుల పుస్తకాన్ని నిర్వహించాలని తెలిపారు. రిజిస్టర్లో బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన జమలు, ఉపసంహరణలు, నగదు లావాదేవీలు ఖర్చుల రసీదు ల వివరాలు పూర్తిగా నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజిస్టర్లో నమోదు చేస్తున్న లెక్కలతో సరి చూసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రచార అనుమతుల కొరకు కలెక్టరేట్లో నెలకొల్పిన సువిధ సెల్ కు లిఖితపూర్వకంగా కనీసం 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని అనుమతులు సువిధ ద్వారానే జరుగుతాయని వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించినట్లు సమాచారం ఉంటే ఫొటోలు, వీడియోలను ఈసీఐ కల్పించిన సి-విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల ప్రసార ప్రకటనలను జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆపరేటివ్ అధికారి సంజీవ్ రెడ్డి, ఆర్డీఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మీడియా సెంటర్ ప్రారంభం..

జిల్లా కలెక్టరేట్‌లోని డీపీఆర్ ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) ను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఎప్పటికపుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ ఓ ఆయుబ్ అలీ, ఆర్డీవో వాసు చంద్ర, ఆదనవు పీఆర్ ఓ ప్రేమలత, ఎలక్షన్ పర్యవేక్షకులు విశ్వనారాయణ, జగదీశ్వర్, ఎంసీఎంసీ సభ్యులు మెండు రవీందర్ పాల్గొన్నారు.

# రాజా శ్రీనివాస్‌రావుకు నిట్ అవార్డు



**వరంగల్ వాయిస్, నిట్:** సంఘ సేవ, సామాజిక సేవారంగంలో విశిష్ఠ సేవలు అందించిన ఐత రాజా శ్రీనివాస్‌రావుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ లో మంగళవారం జరిగిన 65వ స్థాపన దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. హన్మకొండకు చెందిన రాజా శ్రీనివాస్ రావు నిట్ క్యాంపస్‌లో చదువును పూర్తి చేసుకుని, ప్రస్తుతం అబుదాబి దేశంలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. సమాజం తనకేమి ఇచ్చిందనేది కాకుండా సమాజానికి తానేమిస్తున్నాననే సామాజిక స్పృహతో అనేక మందికి రాజా శ్రీనివాస్ రావు సేవలందిస్తున్నారు. ఇండియాతోపాటు, అబుదాబీ దేశంలోని భారతీయులకు ఆర్థిక పరంగా, వైద్య పరంగా, వీసా సమస్యల పరంగా ఎదురైన ఇబ్బందులకు తనవంతుగా ఆయన సేవలందిస్తున్నారు. తెలంగాణలోని పేద రైతులను ఆదుకోవాలనే గొప్ప లక్ష్యంతో తాను స్వయంగా స్థాపించిన రైతు బాంధవ చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నారు. అబుదాబీ దేశంలోని తెలుగువారితో కలిసి భారతీయ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలను గౌరవిస్తూ అనేక కార్యక్రమాల నిర్వహణలో శ్రీనివాస్ రావు క్రీయాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రతీ సంవత్సరం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాజా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. కాగా, నిట్ ఉద్యోగిగా పనిచేస్తూ, తన ఎదుగుదలకు ఎంతగానో కృషి చేసిన తన తండ్రి మోహన్‌రావును గుర్తు చేసుకుని రాజా శ్రీనివాస్ రావు భావోద్వేగానికి గురయ్యారు. ఏ విధమైన ప్రతిఫలం ఆశించకుండా సమాజానికి సేవచేయడంలో ఉన్న సంతృప్తి ఎన్నో అవార్డులకు సమానమన్నారు.

# ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి: సీపీ రంగనాథ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సాధారణ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించుటకు తగిన చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావిణ్య, సిక్తా పట్నాయక్, శివలింగయ్య, డీసీపీలతో కలిసి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, సోషల్ మీడియా, సీజింగ్ కమిటీ, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ, ఎంసీఎంసి కమిటీ, సభ్యులు ఆర్ఓలతో కలిసి సీపీ సమీక్షించారు. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

# 14నుంచి శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరం శ్రీనివాస కాలనీలోని శ్రీ శృంగేరి శంకర మఠంలో ఈనెల 14నుంచి శారద శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేతుల మీదుగా బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ జగద్గురువులు శ్రీ భారతీ తీర్థమహాస్వామి, విధ్యాశేఖర భారతీస్వామి ఆశీస్సులతో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈనెల 14వ తేది ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 14వ తేదీన అమ్మవారిని పసుపు అలంకారంలో 'హరిద్ర దర్శనం' లో సాక్షాత్కరిస్తారన్నారు. 24వ తేదీ వరకు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి రోజు నిత్య పూజా, హెూమం, అభిషేకం, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా మంగళ హారతి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు (బ్రాంచ్ హెడ్) సంగమేశ్వర్ జోషి, శంకర్ సేవా సమితి భక్తులు శ్రీ రంగాచారి, స్వామి, చంద్రశేఖర్, బలరామ శాస్త్రీ, ప్రిన్సిపాల్ సాంబమూర్తి, డాక్టర్ పోలా నటరాజ్, దేవేందర్, భాస్కర్, రామారావు, నర్సింహమూర్తి, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు. వరంగల్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# నేను మీ మనిషిని: ములుగు ఎమ్మెల్యే సీతక్క

## టూరిస్టులు వస్తుంటారు.. పోతుంటారు



**వరంగల్ వాయిస్, ములుగు :** నేను మీ మనిషిని..జనం భాదలు తెలిసిన వ్యక్తిని..నేను గెలిస్తే ప్రజలు గెలిచినట్లేనని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ములుగు నియోజక వర్గ ప్రజలే నా కుటుంబం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందన్నారు. టూరిస్టులు వస్తుంటారు.. పోతుంటారు. ఒకవేళ వాళ్ళు గెలిస్తే డబ్బు గెలిచినట్లేనన్నారు. 250 మంది బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంగళవారం వేంకటాపూర్ మండలంలోని నల్లగుంట ఎస్సీ వాడకు చెందిన సుమారు 130 మంది గాంపోని పల్లి గ్రామానికి చెందిన 90 మంది, లక్ష్మీ దేవి పేట గ్రామానికి చెందిన 10 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మల్లాడి రాం రెడ్డి, బై రెడ్డి బాగ్ వాన్ రెడ్డి, చెన్నోజు సూర్య నారాయణ, బండి శ్రీనివాస్, మూడు విరేష్, మైస ప్రభాకర్, బానోత్ భాస్కర్, సుమన్, కోడూరి రమేష్, రాజీ రెడ్డి, పల్లె జయ పాల్ రెడ్డి, కట్టే కోళ్ల వెంకటేష్, దొంతర వేని కుమార్, చక్రపు శ్రీను, సుమన్ రెడ్డి, మామిడి శెట్టి కోటి, పేరుమండ్ల రాజేందర్, పవన్, కంతల నర్సింహ రెడ్డి, మమిండ్ల రాజు బొడ్డురామన్న, కొండ తిరుపతి, జనగాం నాగరాజు, భాస్కర్, లింగ స్వామి, కోమురవెల్లి రమేష్, శామల జయ పాల్ రెడ్డి, సుకృ, అన్న రవి, వార్డు సభ్యులు రంగి శెట్టి రవి, పెరుమండ్లా పున్నం, గాజవెని దని, పుణ్య మూర్తి సంపత్, నక్క సదయ్య, గొర్రె రాజయ్య, సమ్మయ్య, దుగ్యల రత్నాకర్ రావు, కొండయ్య, గోవింద్ నాయక్, రవి, గట్టు వెంకన్న, కొండ రఘుపతి, గట్టు సాంబయ్య పాల్గొన్నారు.

# భూపాల్ నాయక్‌కు డోర్నకల్ టికెట్ కేటాయించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గం టికెట్ ను ననావత్ భూపాల్ నాయక్ కు కేటాయించాలంటూ ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తెలిపారు. ఏఐసీసీ పెద్దలు పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఢిల్లీకి చేరుకున్నారు. సీడబ్ల్యూసీలో నిర్వహించిన లైవ్ కాన్ఫరెన్స్ లో వీరు పాల్గొన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతోపాటు మల్లికార్జున్ ఖర్గే, మాణిఖ్యం ఠాకూర్, కొప్పుల రాజు, సీఎం.సచిన్ పైలెట్, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, వంశి చందర్ రెడ్డి, సీఎల్పీ నేత బట్టి విక్రమార్క వీరందరి ఆదేశాల మేరకు తెలంగాణలోని నాలుగు జిల్లాలకు చెందిన ప్రతినిధులు ఢిల్లీ ఏఐసీసీ ఆఫీసులో మకాం వేసి భూపాల్ నాయక్ టికెట్ ఖరారు ప్రయత్నిస్తున్నారు. వీరితోపాటు జాతీయ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షులు కట్కూరి సందీప్, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు జేరిపోతుల రంగన్న గౌడ్, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గుమ్ముల ఉమేష్ గంగపుత్ర ఈరోజు ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్లు అందరినీ కలిశారు. ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ పెద్దలందరూ తెలంగాణ రాష్ట్రంపైన దృష్టి పెట్టి విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు వెల్లడించారు. వివిధ సర్వేల్లోనూ భూపాల్ నాయక్ ముందు వరుసలో ఉన్నాడంటూ సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com